ప్రజాశక్తి
శనివారం 5, నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి



మట్టి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పొలాలకు వెళ్లే రహదారి పనులను పీడీ రామాంజినేయులు శుక్రవారం పరిశీలించారు. పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు. అర్హులైన రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు అందిస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులు సాగుచేసిన మామిడి పంటను పరిశీలించారు. విరివిగా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాగిరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ ముఖద్వారం

ఎస్కేయూలో రివర్సు 'టెండరింగ్'

ఎక్కువ కోడ్ చేసిన వారికే టెండరు ఇదేమి మతలబో..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టిన పని రివర్సు టెండరింగు..ఎక్కువ ధరకు పనులకు అప్పగించకుండా ప్రభుత్వానికి మిగులు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ పనిని చేపట్టింది. ఇప్పటికీ టెండరు పిలిచే సమయంలో వివిధ దశల్లో వడపోత చేపడుతోంది. అయితే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మాత్రం ప్రభుత్వ విధానానికి భిన్నంగా వ్యవహరించడం గమనార్హం. టెండరులో తక్కువ కోడ్ చేసిన వారికి కాదని ఎక్కువకు కోడ్ చేసిన వారికి టెండరును కట్టబెట్టడం చర్చనీయాంశం అవుతోంది. ఇదేమి మతలబు అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

రూ.27 లక్షలు అదనపు భారం

పరీక్షల నిర్వహణకు సంబంధించి ఒఎంఆర్ షీట్లు, జవాబుపత్రాల బుక్‌లెట్స్ తయారీ, ఇతర జాబ్ వర్కు కోసం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఏడు భాగాలుగా విభజించి టెండర్లు ఆహ్వానించింది. ఈ టెండరు పని రెండు కోట్ల లోపు ఉంటే ఐదు కోట్ల టర్నోవర్ ఉన్న వారు మాత్రమే పాల్గొనాలన్న నిబంధనను పెట్టింది. అది పెట్టిన తరువాత కూడా కొన్ని సంస్థలు పోటీపడ్డాయి. ఇందులో ప్రధానంగా రెండు సంస్థలు పోటీపడగా ఎల్1 వచ్చిన సంస్థకు కాకుండా ఎల్ 2కు పనులను అప్పగించారు. మొత్తం రూ.1.40 కోట్ల విలువైన పనికి పిలిచిన ఈ టెండర్లలో ఈ రకంగా అధిక ధరకు కోడ్ చేసిన వారికివ్వడం మూలంగా విశ్వవిద్యాలయంపై రూ.27 లక్షల వరకు అదనపు భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోటీపడిన రెండు సంస్థలు వేసిన టెండరు ధరలు చూస్తే ఇట్టే అర్థమవుతుంది. హైటెక్ ప్రింట్ సిస్టమ్ లిమిటెడ్ అనే సంస్థ, విఎస్.హైటెక్ సెక్యూరిటీ ఫార్మ్స్ ప్రయివేటు లిమిటెడ్ అనే సంస్థలు పోటీపడ్డాయి. ఇందులో విభాగాల వారీగా చూస్తే హైటెక్ ప్రింట్ సంస్థ కంటే విఎస్ హైటెక్ సెక్యూరిటీ ఫార్మ్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ అన్నింటిలోనూ తక్కువ ధరనే కోడ్ చేసింది. ఇవి వరుసగా ఈ విధంగా ఉన్నాయి. రూ.10.58, 10.45,10,11.95, 3.95, 2.89, 1.89 ఉన్నాయి. ఇక హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్ కోడ్ చేసిన విలువలు ఈ విధంగా ఉన్నాయి వరుసగా రూ.12.69, 12.15, 12.96, 14.04, 4.95,3.33, 2.43 ఉన్నాయి. అన్నింటిలోనూ ఎల్1 సంస్థగా విఎస్ హైటెక్ నిలుస్తుంది. కాని అలా కాదని హైటెక్ సంస్థకు పనులను శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అప్పగించింది. ఈ రకంగా అప్పగించడం మూలంగా రూ.27 లక్షలు అదనపు భారం పడనుంది.

ఆర్థిక ఇబ్బందులున్నా

ఒకవైపు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆర్థిక ఇబ్బందులతో నడుస్తోంది. అనేక పనులు పెండింగులో ఉన్నాయి. ఇటువంటి సమయంలో ఉన్న ఆర్థిక వనరులను పొదుపుగా వాడాల్సిందిపోయి అదనపు భారం పడే విధంగా వ్యవహరించడం చర్చనీయాంశం అవుతోంది. తక్కువ ధరకే చేస్తామని ముందుకొచ్చిన వారిని కూడా కాదని అధిక ధరలకు కోడ్ చేసిన వారికి పనులు అప్పగించడం వెనుక మతలబు ఏమిటన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బియ్యంతో సరిపెట్టుకోవాల్సిందేనా..!

రోజు రోజుకూ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొనుగోలు చేయలేరనే ఉద్దేశంతో పేద ప్రజల కోసం ప్రభుత్వాలు ప్రజాపంపిణీ వ్యవస్థను తీసుకొచ్చాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు బియ్యంతో పాటు చక్కెర, మంచినూనె, కందిబేడలు, గోదుమలు, గోమపిండి సబ్సిడీతో అందించేవారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ప్రస్తుతం ఇస్తున్న వాటితోపాటు మరిన్ని సరుకులను కలిపి ఒక సంచిలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి గడపకూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చాక గతంలో ఇస్తున్న సరుకులను సైతం ఇవ్వడంలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బియ్యంతో పాటు అప్పుడప్పుడు అరకిలో చక్కెర మాత్రమే అందిస్తుండడం గమనార్హం.

పెరుగుతున్న నిత్యావసరాల ధరలు
నీరు గారుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ
పేదలకు అందని పౌష్టికాహారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో 62 చౌక దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాలకు అనుసందానంగా 37,564 రేషన్ కార్డులు ఉన్నాయి. సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయడం కోసం 22 మొబైల్ వాహనాలను కేటాయించారు. ప్రతి వాహనానికి ఆపరేటర్, అసిస్టెంట్, వాలంటీర్, వీఆర్‌వో లను ఒక బృందంగా ఏర్పాటు చేశారు. ప్రతి గడపకూ వెళ్లి సరుకులను అందించాలని ప్రభుత్వం నిబంధనలు తీసుకొచ్చింది. అయితే ఈ నిబంధనలు ఎక్కడా అమలుకావడం లేదు. ఇప్పటికీ సరుకులను రేషన్ దుకాణాల్లోనే డీలర్లు అందిస్తున్నారు.

బియ్యంతోనే సరిపెడుతున్న వైనం..

ప్రస్తుత ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం పంపిణీ చేస్తూ సరిపెడుతోంది. బియ్యం ఒక్కటే తీసుకుని బతకమని చెబుతున్నట్లు అనిపిస్తోంది. మిగిలిన నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేక పేదలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా పండగ పూట కూడా పేదలకు పట్టెడు పప్పన్నం దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ నెల కూడా పేదలకు కందిపప్పు, చక్కెర వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీపావళికి వీటిని ప్రభుత్వం అందించిన పాపాన పోలేదు. ఇక నవంబర్ నెలలోనూ ఇవి పేదలకు అందే పరిస్థితి లేదని తెలుస్తోంది. టిడిపి ప్రభుత్వం సంక్రాంతికి, దీపావళికి, ఇతర మైనారిటీల పండుగలకు కానుక, తోఫాల పేరుతో సరుకులు పంపిణీ చేసేది. ఇలా చేయలేని పరిస్థితిలో అదనపు కోటా అయినా ఇవ్వాల్సి ఉంది. అరకిలో చక్కెర, కిలో కందిపప్పు అదనంగా ఇవ్వాలి. అదనం కాదు గదా కనీసం నెలనెలా అందించే సరుకులు కూడా ఇవ్వడం లేదు.

ఆకాశాన్నంటుతున్న ధరలు..

బయట దుకాణాల్లో ధరలు విపరీతంగా మండిపోతున్నాయి. కిలో కందిపప్పు ధర.130 నుంచి రూ.150 పలుకుతోంది. అదే చౌకదుకాణంలో అయితే ఇది రూ.60కే దొరికేది. పేదలకు కాస్తయినా పౌష్టికాహారం దొరికేది. ఇదే విధంగా మిగిలిన వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పామాయిల్ కొనాలన్నా రూ.145 వరకు వెచ్చించాలి. పేదలను ఈ ధరల భారం నుంచి ఆదుకోవాలంటే చౌకదుకాణాలను బలోపేతం చేసి వాటి ద్వారా సరుకులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



హిందూపురం పట్టణంలో మూలనపడ్డ బియ్యం సరఫరా చేసే వాహనం

డీఈవో బదిలీ ఉత్తర్వులను రద్దుచేయాలి

డీఆర్వో గాయత్రిదేవికి యుటిఎఫ్, ఎస్‌టియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ బదిలీ ఉత్తర్వులను వెంటనే రద్దుచేయాలని యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు డిఆర్ఒ గాయత్రిదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 'నకిలీ ఓట్ల నమోదుకు సహకరించలేదని డిఇఒ ఆకస్మిక బదిలీ' అనే వార్త చూడగానే జిల్లా ఉపాధ్యాయ లోకం ఆశ్చర్యపోయిందన్నారు. అధికారులపై కక్షగట్టి బదిలీ చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, రాష్ట్రోపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. డీఈవో శామ్యూల్ మూడేళ్లుగా జిల్లాలో నిజాయతీగా, ఎన్ని ఒత్తిడిలు వచ్చినా ఎక్కడా రాజీ పడకుండా విధులు నిర్వర్తించారని అన్నారు. విద్యలో అనంతపురం జిల్లాను రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిపిన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి అధికారిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నకిలీ ఓట్ల నమోదుకు సహకరించలేదని ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చి బదిలీ చేయించడం బాధాకరమన్నారు. ఇది నిజాయతీ అధికారుల మనోధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అవుతుందన్నారు. డీఈవో బదిలీ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం పూర్తి అయ్యేంత వరకు ఆయనను ప్రస్తుత స్థానంలోనే విధులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, యుటిఎఫ్ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు రమణయ్య, ఎస్‌టియు, యుటిఎఫ్ నాయకులు శివయ్య ఆచారి, బాబ్జి నాయక్, సుంకన్న, కిషోర్ సుబ్బరాయుడు, శివప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

సర్పంచుల సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలువురు సర్పంచులు స్థానిక ఎంపీ గోరంట్ల మాధవ్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మండలకేంద్రానికి వచ్చిన ఆయనను కలిసిన సర్పంచులు తమ సమస్యలను విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ విద్యుత్ బకాయిల కోసం గతంలోనే తమ సీఎఫ్‌ఎంఎస్ ఖాతాలలో వున్న 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా తీసేసుకుందన్నారు. ప్రస్తుతం విడదలైన 15వ ఆర్థిక సంఘం రెండవ విడత నిధుల నుండి 50 శాతం విద్యుత్ బకాయిలు, క్లాప్ మిత్రలకు ఆరు నెలల వేతనాలు చెల్లించమని ప్రభుత్వం చెప్పడం భావ్యం కాదన్నారు. తాము బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలకు లక్షలాది రూపాయలు వెచ్చించామని, ప్రస్తుతం విడుదలైన నిధులను ఇప్పటి వరుకు తాము చేసి పనుల బిల్లుల చెల్లింపులకు మాత్రమే వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు చెట్ల రుద్రప్ప మృతి

ప్రజాశక్తి-అనంతపురం

సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు చెట్ల రుద్రప్ప (105) శుక్రవారం నాడు తన స్వగ్రామమైన శెట్టూరులో మృతి చెందారు. వందేళ్లు దాటినా హుషారుగా తిరిగే రుద్రప్ప నాలుగు రోజుల క్రితం కిందపడి అనారోగ్యానికి గురయ్యారు. గురువారం మధ్యాహ్నం ఆయన మృతి చెందారు. స్వాతంత్ర్యోద్యమం నుంచి ప్రజాపోరాటాల్లోకి వచ్చారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను నెల రోజుల పాటు జైళ్లో పెట్టారు. ఐదుకల్లు సదాశివన్ నాయకత్వంలో కళ్యాణదుర్గం తాలుకా నాయకులు ఎర్రిస్వామి, పిఎస్.శర్మ నేతృత్వంలో 1952 సంవత్సరంలో ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. అనంతపురానికి నదీ జలాల కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో బంజరు భూములను పేదలకు పంచాలని జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు. అక్రమంగా కర్నాటకు తరలివెళ్తున్న ఆహార ధాన్యాలను అడ్డుకుని పేదలకు పంచే కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ఈ సమయంలో ఆయనపై హత్యాయత్నం సైతం జరిగింది. 1981లో గ్రామ సర్పంచి గానూ ఎన్నికై ప్రజలకు సేవలందించారు. ఇలా తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు రుద్రప్ప నిలబడ్డారు. ఆయన కుమారుడు చెట్ల ఈశ్వరయ్య కూడా తండ్రి బాటలోనే పయనిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆయన పనిచేస్తున్నారు.

సిపిఎం నివాళి

శెట్టూరు గ్రామంలోనున్న చెట్ల రుద్రప్ప భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సందర్శించి నివాళుల ర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చెట్ల రుద్రప్ప జీవితం నేటి తరానికి ఆదర్శమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, నాయకులు రంగనాథ్, సురేష్ పాల్గొన్నారు.



సవితమ్మ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న సిఐడి అధికారులు

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

సవితమ్మ ఇంట్లో సిబిఐ దాడులు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ పట్టణంలోని వజ్రాలపేటలో ఉన్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఇంట్లో సిబిఐ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కర్నాటకలో నమోదైన రైల్వే కేసు విషయంలో సవితమ్మను సిబిఐ అధికారులు విచారించారు. సవితమ్మ భర్త వెంకటేష్ రైల్వే కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. రైల్వే పనుల్లో అధికారుల అవినీతి పెచ్చుమీరిందని సిబిఐకి ఫిర్యాదులు అందాయి. అధికారుల అవినీతిపై వెంకటేష్ వద్ద సాక్ష్యాల కోసం సిబిఐ అధికారులు పెనుకొండలోని సవితమ్మ ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సిబిఐ అధికారుల బృందం ఉదయం నుంచి దాదాపు 7 గంటల పాటు తనిఖీలు చేపట్టారు. సవితమ్మ ఇంట్లో రికార్డులు, ఇతర లావాదేవీలను అధికారులు పరిశీలించారు. దీనిపై మీడియా సిబిఐ అధికారులను వివరణ కోరగా వారు స్పందించలేదు. ఇది కేవలం రైల్వే కేసు మాత్రమే అని చెప్పారు. సవితమ్మ ఇంట్లో సిబిఐ దాడులు జరుగుతున్నాయన్న సమాచారం తెలుసుకున్న టిడిపి పెనుకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హిందూపురం మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. సిబిఐ దాడులను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. సిబిఐ అధికారులు ఎందుకు తనిఖీలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా టిడిపి కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో సవితమ్మ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రమేష్ సిబ్బందితో అక్కడికి చేరుకుని టిడిపి కార్యకర్తలను పంపించివేశారు. సిబిఐ అధికారులు తనిఖీలను పూర్తిచేసుకుని అక్కడినుండి వెళ్లిపోయారు.

కార్మికుల వినూత్న నిరసన

చెత్తతో ఎంపీడీవో కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి. గాండ్లపెంట

మండలంలోని పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని చెత్తతో శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, నాయకులు రామకృష్ణ, రమేష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేతనాల పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. స్పందించిన అధికారులు 15వ ఆర్థిక సంఘ నిధులు సర్పంచుల ఖాతాలో జమ అయ్యాయని వారితో సంప్రదించి నాలుగు నెలల వేతనాలు వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో. పారిశుధ్య కార్మికులు కదిరప్ప, నరసింహులు, అక్కులప్ప, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - తాడిమర్రి

సత్యసాయి వాటర్‌సప్లయ్ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో తాడిమర్రి మండలంలోని సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు తమ సమస్యల పరిష్కారంలో కోసం 8 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఓబులు పాల్గొని తన మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు 572 మంది 25 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు రావాల్సిన గ్రాడ్యుటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 25సంవత్సరాల నుండి కార్మికులకు రావాల్సిన గ్రాడ్యుటి డబ్బులు చెల్లించే వరకు కార్మికులు సమ్మెలో కొనసాగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, శ్రీరాములు, నబిరసూల్, ఓబులేసు, సుధాకర్, తిరుపాలు, ఆచారి రవికుమార్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, లక్ష్మీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

హమాలీలకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి గోరంట్ల

శ్రీ సత్య సాయి జిల్లాలోని స్టాక్ పాయింట్ గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీలకు సివిల్ సప్లై డిఎం అశ్వత్థ నారాయణ నాయక్ శుక్రవారం యూనిఫాం పంపిణీ చేసినట్లు మండల సివిల్ సప్లై హమాలీల యూనియన్ నాయకుడు గంగాధర్ తెలిపారు ఒక హమాలికి మూడు జతలు ప్రకారం పంపిణీ చేశారని చెప్పారు. జిల్లాలో 12 స్టాక్ పాయింట్ల పనిచేసే హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారని అన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బడిబస్సులు నడపాలి

మడకశిర : విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు బడిబస్సులను సకాలంలో నడపాలని పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు శుక్రవారం స్థానిక ఆర్టీసీడిపో మేనేజరును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అమరాపురం, రొళ్ల, అగలి, గుడిబండ, పెనుగొండ, హిందూపురం ప్రాంతాల నుంచి వేలాది మంది విద్యార్థులు మడకశిర ప్రాంతానికి విద్యాభ్యాసం కోసం ప్రతి రోజూ వస్తుంటారన్నారు. అయితే మడకశిర డిపో నుండి విద్యార్థుల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతినెల వందల రూపాయలు వెచ్చించి బస్సు పాసులు తీసుకున్నప్పటికీ సమయానికి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయివేటు వాహనాలలో ఛార్జీలు చెల్లించి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అదేవిధంగా పెనుగొండ ప్రాంతంలో మడకశిర డిపో నుంచి కొన్ని సర్వీసులు రద్దు చేయడం వల్ల అటు ప్రయాణికులు ఇటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారరు. విద్యార్థుల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపకపోతే వేలాదిమంది విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆర్టీసీ డిపో కార్యాలయం ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిసంఘం జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, శశికుమార్, మడకశిర పట్టణ కోశాధికారి హేమంత్, రాజేష్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు,

సామాజిక తనిఖీపై గ్రామసభ

పరిగి : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలోఖరీఫ్ 2022 సంబంధించి ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రచురించారు. ఈనేపథ్యంలో 3,4 తేదీలలో జరిగే గ్రామ సభలలో భాగంగా హెన్నంపల్లి రైతు భరోసా కేంద్రంలోని ధనాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి విజయభారతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్ కుమార్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ హరీష్, వీఆర్వో గంగాధర్, విలేజ్ సర్వేయర్ కృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రమేష్ బాబు, ఎంపీటీసీ గంగాదేవి, రైతు సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

రొద్దం : టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళాలకు చట్టాలపై అవగాహన సదస్సునును శుక్రవారం నిర్వహించారు. మండలంలోని బూచెర్ల గ్రామాంలో నిర్వహించిన అవగాహన సదస్సులో సంస్థ సిఇఒ లావణ్య, సుకన్య, మహాశక్తి సిఇఒ అశ్విని, షామిలి తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. చట్టాలపై నృత్యరూపకంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల సిబ్బంది, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

14న గిరిజనుల చలో కలెక్టరేట్

పుట్టపర్తిఅర్బన్ : ఎస్‌టి జాబితాలో ఇతర కులాలను చేర్చే జీవో 52 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 14న గిరిజనుల చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. గిరిజన సంఘం, ఎల్ హెచ్ పి ఎస్, బంజారా సంఘం నాయకులు మాట్లాడుతూ ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదనలు తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈనెల 14న పుట్టపర్తిలో సత్యమ్మ గుడి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వేలాదిమంది గిరిజనులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. పార్టీలకతీతంగా ఈ ర్యాలీ లో గిరిజనులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా గిరిజన సంఘాల నాయకులు కాలే నాయక్, రమేష్ నాయక్, రవి నాయక్, విజయ్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముదిగుబ్బ : అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని భూదానం పల్లిలో శుక్రవారం నిర్వహించిన గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఆయన ఆపల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, జెడ్పీటీసీ తిరుమల బాయ్ సేవే నాయక్, ఇందుకూరు నారాయణరెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సత్యసాయి జయంతి వేడుకలు

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి పుట్టపర్తిఅర్బన్

సత్యసాయి 97వ జయంతి వేడుకలను అధికారులందరూ సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ హాల్ లో జరిగిన సమీక్ష సమావేశంలో ఎస్‌పి రాహుల్ దేవ్ సింగ్, జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, ట్రస్టు సభ్యులు చలం, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని అవసరమైతే మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిత్రావతి పరివాహక ప్రాంతంలో విద్యుత్ దీపాలంకరణ చేయాలని, రహదారుల మరమ్మత్తు పనులు చేపట్టాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి ఏర్పాటు వైద్య సదుపాయాలు ఈనెల 12 కు పూర్తి చేయాలన్నారు. ఈనెల 18 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈనెల 23న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటిస్తారన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ జయంతి వేడుకలకు 60 వేల మంది పైగా పర్యాటకులు భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 22 సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ పాల్గొంటారన్నారు. 23న జరిగే జన్మదిన వేడుకలు ఘనంగా జరగడానికి ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో భాగ్యరేఖ, టూరిజం శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ శర్వాన్, సోహల్ ఫారెస్ట్ డిఎఫ్ఒ శ్యామల, ఆర్‌టిఒ కరుణాకర్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ట్యాక్సుల పెంపుతో డ్రైవర్లు రోడ్డు పాలు

ప్రజాశక్తి -పెనుకొండ

రోడ్డు భద్రత చట్టం పేరుతో కేంద్ర ప్రభుత్వం ట్యాక్స్ పెంచి డ్రైవర్లను రోడ్డు పాలు చేస్తోందని ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఫిక్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో కార్ల డ్రైవర్లు, ఓనర్లతో నిర్వహించిన సమావేశంలో రఫిక్‌తో పాటు సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు రంగంలో స్వయం ఉపాధితో జీవనం కొనసాగిస్తున్న డ్రైవర్లు ప్రభుత్వానికి ఆదాయం ఇస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వాలు డ్రైవర్లకు ఎలాంటి ఉపాధి చూపించలేదని విమర్శించారు. ట్రాన్స్‌పోర్టు రంగం కార్మికులకు కేంద్ర ప్రభుత్వం భారం వేస్తూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఎఫ్‌సి గతంలో రెండు సంవత్సరాలకు రూ 600 ఉండగా, ప్రస్తుతం వెయ్యి రూపాయలు పెంచడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఐటియు అనుబంధంగా శ్రీ కృష్ణదేవరాయ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రమేష్, అధ్యక్షులుగా వి. శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పి రవి ,సహాయ కార్యదర్శులుగా రాజారెడ్డి, సంపత్ నాయక్, వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జగదీష్, హరిప్రసాద్, ఎస్ విష్ణు, కోశాధికారిగా లక్ష్మీప్రసాద్, బి మారుతి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇచ్చిన హామీలను అమలుచేయాలి

ప్రజాశక్తి -పెనుకొండ

పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నగర పంచాయతీ కార్మికుల పట్టణ మహాసభను చిన్న వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో యన్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కరోనా కాలంలో మృతిచెందినకార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ 50 లక్షలు బీమా ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చాయన్నారు. అయితే ఆ హామీ ఇంతవరకు అమలు కాలేదన్నారు.కార్మికులను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు రంగ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఫిక్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రమేష్, అధ్యక్షులుగా రిక్షా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా చిన్న వెంకటేష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీదేవి, శాంతమ్మ, నాగమ్మ, గంగ రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా తిప్పన్న, ముత్యాలు, చంద్ర, వెంకటేష్, కోశాధికారిగా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కనిపించని అభివృద్ధి : పల్లె

ఓబులదేవరచెరువు : మూడున్నర సంవత్సరాల వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అప్పులు తప్ప అభివృద్ధి కన్పించలేదనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. రైతు సమస్యలపై మండలంలోని కొండక మర్ల నుండి ఓడిసి తహశీల్దార్ కార్యాలయం వరకు టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పల్లె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తెలుగుదేశం పార్టీ నాయకును దాడులు కేసులతో వేధించడం తప్ప మరో పని లేనట్టుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. వైసిపి అరాచక పాలన అంతమొందించడానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలువపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, గోపాల్ రెడ్డి, పార్లమెంట్ రైతు మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ జాకీర్ అహ్మద్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిసం రామాంజనేయులు, ఓబుల్ రెడ్డితో పాటు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పల్లె రఘునాథరెడ్డి

ప్లాస్టిక్ నిషేధం అమలు

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని అలాగే పారిశుధ్య నిర్వహణలో సమూల మార్పులను తీసుకోద్దామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్నా శానిటరీ సెక్రేటరీలతో పారిశుధ్య నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతు పురపాలక సంఘంలో ఎంపిక చేసిన వార్డుల్లో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం ఇప్పటికే చేపట్టామన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన మార్గదర్శకాల్లో భాగంగా ప్రభుత్వం విధించిన విధంగా డబ్బులు వసూలు చేయడంలో చాలా వార్డుల శానిటరీ సెక్రేరీలు వెనుకబడ్డారన్నారు. ఇంటింటి చెత్త సేకరణలో సచివాలయ సెక్రటరీలతో పాటు వార్డు వాలంటీర్లను, మహిళా సంఘాల ప్రతినిధులను భాగస్వామ్యం చేసి పారిశుధ్య నిర్వహణలో సమూలు మార్పులు తీసుకు రావాలన్నారు. ఈ సమావేశంలో ఎఇ నాగేంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్, శాటనిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి

ధర్మవరం టౌన్ : ప్రతి విద్యార్థిని ఇష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని బెంగుళూరుకు చెందిన లయన్స్ క్లబ్ అధ్యక్షులు నాదెల అర్చన, కార్యదర్శి ఈవెంకట్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కంటి చూపు మందగించిన వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెంగుళూర్ లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కీర్తి వినోద్, సభ్యులు జగన్నాథ్, ధర్మవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు చందా నాగరాజు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని గీతా నగర్ లో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శంకర్ నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగ ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి నరసింహామూర్తి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, కన్వీనర్ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ డిసి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురోహితుడు దారుణ హత్య

అమరాపురం : మండలంలోని హేమావతి గ్రామానికి చెందిన పురోహితు శశిధర్ శర్మ (52) దారుణహత్యకు గురయ్యాడు. అవివాహితుడైన శశిధర్‌శర్మ గురువారం రాత్రి ఇంటిలో ఒక్కడే ఉండగా దుండగులు ఇంటిలోకి చొరబడి హత్య చేశారు. ఇంటిలో ఉన్న నగదు, బంగారు ఆభరణాల ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శశిధర్‌శర్మ హత్యను బ్రాహ్మణ సంఘాలు ఖండించాయి. బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిశంకర్, కార్యదర్శి వెంకట్రావు, పెలుబండ స్వామి, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ హత్యకేసును చేధించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వాహనం ఢీకొని ఇద్దరు మృతి

గోరంట్ల : మండలంలోని చలమయ్య గారి పల్లి సమీపన కదిరి రోడ్డులో గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందాడు. ద్విచక్ర వాహనంలో వెళుతున్న కమ్మల వాండ్లపల్లి చెందిన సోమశేఖర్ (40), బాలరాజు (40) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు కమల వాండ్లపల్లి నుండి గోరంట్ల కు వస్తుండగా చలమయ్య గారి పల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్కాతో మోసం చేస్తే కేసులే..

ధర్మవరం టౌన్ : మట్కా. రాస్తూ ప్రజలను నమ్మించి మోసంచేస్తే కేసులు నమోదు చేస్తామని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. మద్యం, గుట్కా అమ్ముతున్న, మట్కా రాస్తూ ప్రజలను మోసం చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టణంలో మేదర మారుతి మట్కాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ మహమ్మద్ రఫీ, సిబ్బందితో దాడులుచేసి అతనిని అరెస్టు చేసి రూ.2,375 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దండే రామలింగయ్యను అరెస్టు చేసి అతని వద్దనుండి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, అదేవిధంగా లింగిశెట్టిపాళ్యం సంజయ నగర్లో రూ.4854 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని సిఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

అగళి : మండలంలోని మధూడి గ్రామానికి చెందిన దళిత హనుమంతరాయప్ప (49) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మధూడి నుంచి ఉల్లెకెరకు వెళ్లే రహదారిలో కల్వర్టు దగ్గర ఉన్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఎస్ఐ లావణ్య సిబ్బందితో కలసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. డప్పు కళాకారుల పింఛను తీసుకువస్తానని 1వ తేదీ వెళ్లిన హనుమంతరాయప్ప తిరిగి రాలేదని, అతని ఫోన్‌కూడా స్విచ్ఛాఫ్ వస్తోందని మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెడికల్‌స్టోర్‌లో చోరీ

పుట్టపర్తి రూరల్ : జిల్లా కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న సాయి తేజ మెడికల్ షాప్‌లో గురువారం చోరీ జరిగింది. దీంతో జిల్లా అదనపు ఎస్‌పి రామకృష్ణప్రసాద్ ఘటనాస్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. షాప్ యజమానులతో మాట్లాడారు. అనంతరం స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేసి వీలైనంత తొందరగా నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు.

క్రికెట్ బెట్టింగ్ జూదరుల అరెస్టు

కొత్తచెరువు : మండలకేంద్రంలోని దర్గా ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సిఐ జయనాయక్, ఎస్ఐ లింగన్న తెలిపారు కొత్తచెరువుకు చెందిన ఇర్ఫాన్ ఈ బెట్టింగులు నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. అతనితోపాటు శ్రీనాథ్, చెన్నయ్య, అమర్నాథ్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుండి రూ.1.02 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారుల ఎదుగుదలకు చేయూత

పరిగి : గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉండి ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలున్న ప్రతి క్రీడాకారుని గుర్తించి చేయూత అందిస్తామని దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు పేర్కొన్నారు. జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులకు ఆయన చేయూత నందించారు. ఈనెల 24 నుండి ఉత్తరప్రదేశ్ లోని అయోధ్యలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే 8 మంది క్రీడాకారులకు ట్రస్టు తరఫున 12 వేల రూపాయల విలువైన చెక్కును తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎస్ఐ నరేంద్ర చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి శుక్రవారం గర్భిణీ స్త్రీలకు అందించే పౌష్టిక ఆహార పంపిణీలో పాల్గొన్నారు. జీవితకాల హామీలో భాగంగా పిహెచ్సిలో మెడికల్ ఆఫీసర్ నవీన సమక్షంలో గర్భిణులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించారు.



చెక్కును అందజేస్తున్న వేణుగోపాలరావు, తదితరులు

యునెస్కో గుర్తింపునకు ప్రభుత్వాలు చొరవచూపాలి

ప్రజాశక్తి-హిందూపురం


ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి వీరభద్రాలయ కట్టడాలు, శిల్పకళ, తైలవర్ణ చిత్రాలకు ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో యునెస్కో శాశ్వత గుర్తింపునకు లేపాక్షిలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు చరిత్రకారుడు, సదస్సు సంచాలకులు మైనాస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనస్వామి మాట్లాడారు. లేపాక్షి చరిత్రపై ఇప్పటికే 16 నెలలు కష్టపడి 160పేజీలతో పుస్తకాన్ని తీసుకువచ్చామన్నారు. ఈ పుస్తకం వివిధ భాషల్లో దేశ విదేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. లేపాక్షి వీరభద్రాలయ వైభవానికి యునెస్కో శాశ్వత గుర్తింపు ఆవశ్యకత అనే ప్రధానాంశంపై డిసెంబర్ 14, 15వ తేదీల్లో లేపాక్షిలో జాతీయ సదస్సును తలపెట్టామన్నారు. లేపాక్షి ఆలయానికి ప్రస్తుతం యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు లభించిందని, మరింతగా లేపాక్షి గొప్పదనం చాటడం కోసం జాతీయ స్థాయిలో సదస్సు చేపట్టామని చెప్పారు. ఈ సదస్సుకు దేశంలోని పర్యాటకరంగ నిపుణులు, చరిత్రకారులు, రచయితలు, పర్యాటక పాత్రికేయులు, పురావస్తు పరిశోధకులు, వివిధ యూనివర్శిటీల నుంచి స్కాలర్లు పాల్గొంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక గమ్యస్థానం, విజయనగర సామ్రాజ్యంలో ఆలయాల వైభోగం-అభివృద్ధి, లేపాక్షి వీరభద్రాలయ కట్టడాలు శిల్పకళ, తైలవర్ణ చిత్రాల శోభ, చారిత్రక, కోటలు పర్యాటక వలయాల అభివృద్ధి. ఎర్రగుడి-గుత్తి-పుట్టపర్తి-పెనుకొండ-లేపాక్షి- హేమావతిలను కలుపుతూ బృహత్ పర్యాటక వలయం ఏర్పాటు తదితర అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించడానికి ఆహ్వానిస్తున్నామన్నారు. సదస్సుకు నిర్వహణ కార్యదర్శిగా వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, పర్యాటక విభాగాధిపతి కొక్కొండ విజయబాబు వ్యవహరిస్తారని తెలిపారు.



పుస్తకాన్ని చూపుతున్న మైనాస్వామి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బుక్కపట్నం : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న మండలకేంద్రానికి చెందిన రైతు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారక నగదు పత్రాలను ఆయన శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు లక్ష్మీనారాయణ, నరసప్పల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వైయస్సార్ రైతు బీమా ద్వారా మంజూరైన ఒక్కొక్కరికి రూ.7 లక్షల రూపాయల విలువైన బ్యాంకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, తహశీల్దార్ నటరాజు, ఎంపీడీవో శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి సతీష్ బాబు, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి , అగ్రి అడ్వైజర్ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, సర్పంచి నాగేంద్రమ్మ, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డిచ నాయకులు చౌదరి, ఎంపీటీసీ కిష్టప్ప, విజయ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పరిహార ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

కక్షపూరిత దాడులు : బికె



సవితమ్మతో మాట్లాడుతున్న ప్రార్థసారధి

ప్రజాశక్తి -పెనుకొండ

వైసిపి ప్రభుత్వం అందరి మీద కక్షపూరిత దాడులు నిర్వహిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఇంట్లో సిబిఐ దాడులు నేపథ్యంలో అయన సవితమ్మ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఇంట్లో వారి భర్త లేని సమయంలో సిబిఐ సోదాలు చేయడాన్ని తప్పు బట్టారు. సవిత భర్తపై ఏవైనా అభియోగాలున్నప్పుడు ఆయన ముందు సోదాలు నిర్వహించాల్సి ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరి మీద దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్న పాత్రుడు, అతని కుమారుడు విజయ్‌ల పై కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. సవితమ్మకు పార్టీ అన్ని విధాలు అండగా ఉంటుందని తెలిపారు. దాడులకు, అరెస్టులకు భయపడేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రొద్దం నరసింహులు, కృష్ణమూర్తి, రఘువీరా చౌదరి, రవిశంకర్, శ్రీనివాసులు, మీనాక్షమ్మ, అడ్వకెట్ విశ్వనాథ్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడులకు భయపడం : తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నామనే నెపంతో తన భర్త పేరుతో సిబిఐ దాడులకు తన ఇంటి పైకి వైసిపి ఉసిగొల్పిందని ఇలాంటి దాడులకు భయపడేది లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు అండగా ఉంటానని పార్టీలో ఇలాగే క్రియాశీలకంగా పని చేస్తానని తెలిపారు. 25 సంవత్సరాలుగా తన భర్త రైల్వే కాంట్రాక్టులు చేస్తున్నారన్నారు. నా భర్త ను బెదిరించి తనను రాజకీయంగా ఎదగనీయకుండా చేయడానికి వైసిపి నాయకులు కుట్ర పన్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ టిడిపి నేత సవితమ్మ ఇంటిపై సిబిఐ అధికారులు సోదాలను ఖండిస్తున్నామన్నారు. సిబిఐ దారుడల విషయం తెలుసుకున్న పలువురు టిడిపి నాయకలు సవితమ్మ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీతమ్మ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులు పరామర్శించారు. రాజకీయ కుట్ర లో బాగంగా ఈ సోదాలు చేస్తున్నారని టిడిపి నాయకులు శ్రీరాములు, చంద్రమౌళి, మాధవనాయుడు, సూర్యనారాయణ, డివి అంజినేయులు, శ్రీనివాసులు, ప్రసాద్, త్రివేద్,టైలర్ అంజినేయులు, రొద్దం నర్సింహులు, ఉప్పర నర్సింహులు, మావటూరు గోపాల్, మరవపల్లి నర్సింహులు, కోనాపురం నారాయణ స్వామి, క్రిష్టప్ప తదితరులు విమర్శించారు. తనకు మద్దతు నిలిచిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలకు, సీపీఎం, సీపీఐ నాయకులకు సవితమ్మ ధన్యవాదాలు తెలిపారు.